నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం
14 ఏప్రిల్ 2026

భూ అక్రమార్కులకు అండగా ఓ ప్రజా ప్రతినిధి

-బాధితులకు న్యాయం జరిగేనా..?చిదంబర
-రహస్యం,నినాదం ప్రత్యేక కథనంతో విచారణలో కదలిక....
-మనోడే చూడండి అన్న ప్రజా ప్రతి ఎవరు..?
-ఇలాంటి నేతలకు భవిష్యత్తులో ప్రజల గుణపాఠం చెప్తారా..?



పెద్దపల్లి రూరల్ ఏప్రిల్ 13(నినాదం) : తహ శీల్దార్ కార్యాలయం ఒక చిదంబర రహస్యం అనే నినాదం పత్రిక ప్రత్యేక కథనంతో రెవెన్యూ అధికార యంత్రాంగంలో కదలికలు మొదలయ్యాయి. ఎలిగేడు తహశీల్దార్ కార్యాలయంలో కొందరి అవినీతి అధికారుల మూలంగా ఎవరి భూములు ఎవరికి పట్టాలు అవుతున్నాయో అనే విషయాలు ఎవరికి అర్థం కాని పరిస్థితులు ఉన్న నేపథ్యంలో,బాధితుల పక్షాన నిలబడిన నినాదం మరో ప్రత్యేక కథనాన్ని ప్రచురిస్తుంది. వివరాల్లోకి వెళితే తమ పూర్వీకులు నుంచి వారసత్వంగా తమకు న్యాయంగా రావలసిన భూమిని అక్రమంగా ఇటీవల కుదుదుల మల్లమ్మ పట్టా చేసుకోవడం జరిగింది.మల్లమ్మ పేరు మీదికి పట్టా మార్పిడి చేసేందుకు ప్రాథమిక విచారణ చేసి రిపోర్ట్ రాసిన ఎలిగేడు ఆర్.ఐ.కి ఓ సర్వే నెంబర్లు ఇండ్లు కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగి స్తుంది.ఎలిగేడు రెవెన్యూ కార్యాలయంలో ఎందరో తహశీల్దార్లు ఈ సున్నితమైన అంశాన్ని పరిశీలించి వారసులు అందరూ ఉన్నప్పుడే వాటాల ప్రకారం పట్టా చేయడం జరుగుతుందని తెల్చి చెప్పినట్లు సమాచారం. దశాబాల నుంచి పెండింగ్లో ఉన్న ఈ సమస్యను చాలా తేలికగా పట్టా మార్పిడి చేశారంటే ఆర్.ఐ,తహశీల్దార్ పై ఎన్నో అనుమా నాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక మాజీ ప్రజా ప్రతినిధుల అండదండలతో ఎలిగేడు ఆర్.ఐ. చారిత్రిక తప్పిదానికి తెరలేపి తనతో గతంలో పనిచేసిన బినామీ వీ.ఆర్.ఏ, కుటుంబానికి ఎలిగేడు గ్రామ శివారులో 919, 62, 63, 893, 894, 39, సర్వే నెంబర్లలో 2 ఎకరాల 14 గుంటలు కుదుదుల నరసింహులు భూమిని తప్పుడు సాక్షాలతో వంశవృక్షం సృష్టించి అక్రమంగా పట్టా మార్పిడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఎలిగేడు తహశీల్దార్ కు ఫిర్యాదులు చేసిన విషయం విధితమే. అక్రమ పట్టా విషయం పెద్దది కావడంతో పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి విచారణకు ఆదేశించి నట్టు సమాచారం. దీంతో ఎలిగేడు రెవె న్యూ అధికారులు అయోమయానికి గురై చేసిన తప్పులను సవరించుకునేందుకు, కుదుదుల నరసింహులు వారసుల వివరాలను సేకరించేందుకు ఎలిగేడు, కొత్తూరు,లోక పేట గ్రామాల్లో చెక్కర్లు కొడుతూ, గ్రామాల్లో పలువురి వాంగ్మూలం లిఖితపూర్వకంగా నమోదు చేసినట్లు పలు గ్రామాల కుటుంబ సభ్యులు తెలిపారు. అధికారులు విచారణ చేస్తున్న క్రమంలో భూ అక్రమార్కులు పక్షాన ఓ ప్రముఖ ప్రజా ప్రతినిధి అధికారులకు మనవాళ్లే చూడండి అంటూ చేరవాణి ద్వారా చెప్పడం గ్రామంలో చర్చనీయాం శంగా మారిందని బాధితులు లబోదిబో మంటున్నారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన ఆ ప్రముఖ ప్రజా ప్రతినిధి అక్రమార్కులకు తరపున నిలబడడం పై విమర్శలు వెలువె త్తుతున్నాయి.తప్పు చేస్తే సరిదిద్దాల్సిన నాయకుడే సమర్థించడం ఏంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు..?ఎలిగేడు మండల పరిధిలో పనిచేస్తున్న అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి.ప్రతి చిన్న విషయానికి ఓ ప్రముఖ ప్రజా ప్రతినిధి ఫోన్ చేస్తూ మనవాళ్లే అంటూ చెప్పడం వల్ల బాధితులకు న్యాయం అందడం లేదని బాధితులు వాపోతున్నారు. ఈ పట్టా మార్పిడిలో జరిగిన అవకతవకలను విచారిస్తున్న అధికారులకు రాజకీయ ఒత్తిళ్లు రావడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితులలో ఎలిగేడు తహశీల్దార్ కార్యాలయం అధికారులు అయోమయంల ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిల్లా స్థాయి ఉన్నత అధికారులు నివేదిక కోరడం ఒకవైపు, అయితే ఆ నివేదికను అక్రమార్కులకు అనుకూలంగా ఉండేలా చూడమంటూ రాజకీయ ఒత్తిళ్లు మరోవైపు,ఎటూ తేల్చలేక ఎలిగేడు రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారంటూ గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆర్.ఐ.పై చర్యలు తీసుకోవాల్సిందే. నిస్వార్థంగా పనిచేయాల్సిన ఆర్.ఐ స్వార్థపూరిత ఆలోచనలతో క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండానే పట్టా మార్పిడి చేసేందుకు రిపోర్ట్ రాసిన ఎలిగేడు ఆర్.ఐ పై జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. భూభారతితో రైతుల భూ సంబంధిత సమస్యలు తీరుతాయి అనుకుంటే ఇలాంటి అధికారుల తీరు వల్ల గ్రామాల్లోని రైతులు సరికొత్త సమస్యలు తయారవుతున్నాయి. ఇకనైనా జిల్లా యంత్రాంగం ఇలాంటి అధికారుల పట్ల కాస్త శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

వాటాల ప్రకారం భూములు

పట్టా మార్పిడి చేయాలి..

వాటాల ప్రకారం మా భూములు మాకు పట్టా చేయాలి. మ మ్ముల సంప్రదించకుండా పట్టా వేరొకరి పేరు మీద చేసిన అధికారులపై చర్య తీసుకొని, తక్షణమే అక్రమ పట్టాను తొలగించి న్యాయం చేయాలి. **-బాధితుడు కుదుదుల మల్లయ్య**

కలెక్టరే మమ్ముల ఆదుకోవాలి

మా పూర్వీకుల నుండి వారసత్వంగా మాకు రావలసిన భూముల ను మాకు ఇప్పించాలి. అక్రమ పట్టా చేసుకొని మమ్మ ల్ని బెదిరి స్తున్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ మా కుటుంబాలను ఆదుకోవా లంటూ వేడుకుంటున్నారు.

-కుదుదుల భాగ్యమ్మ బాధితురాలు

ఉపాధిహామీ చట్టాన్ని బలహీన పరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

చింతపల్లి, ఏప్రిల్ 13 (నినాదం): కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉపాధి హామీ చట్టం రోజురోజుకు బలహీన పడుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ఆవేద వ్యక్తం చేశారు.మండలంలోని కుర్మపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు వి బి జి రామ్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాబోయే రోజుల్లో ఉపాధి హామీని పూర్తిగా ఎత్తివేయడం కోసం మోడీ ప్రభుత్వం కుట్రలు కుతంత్రాలు చేయడంలో భాగంగానే వి బి జీ రాంజీ పథకాన్ని తీసుకురావడం జరిగిందని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీలకు అన్యాయం చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉడుగుండ్ల రాములు, మండల కార్యదర్శి పోలే యాదయ్య, స్థానిక నాయకులు పోలోజు వీరబ్రహ్మం, ఐతపాక వెంకటయ్య, చెవిటి యాదయ్య, దేవర శీను, ఉడిగుండ్ల లక్ష్మమ్మ, నూనె సుగుణ, దేవర రజిత, ఉడుగుండ్ల అర్చన, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క పై

తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలి

-కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యనయ్య



ములుగు ప్రతినిధి,ఏప్రిల్ 13(నినాదం): మంత్రి సీతక్క పై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేదే లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యనయ్య అన్నారు. మంగపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యనయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అంటేనే సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోపణలు చేసే అవినీతి పార్టీ అణగారిన వర్గాల నుండి, ఆదివాసీ కులం నుండి ఒక్కో మెట్టు ఎక్కుతూ, నిత్యం ప్రజా సేవ చేస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించి మంత్రి అయిన సీతక్క గారిని ఓర్చుకోలేక బిఆర్ఎస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేయిస్తుంది.తెలంగాణ ఉద్యమ నాయకులు అని చెప్పే క్రిశాంక్ నువ్వు ఈ దొంగ మాటలు ఎందుకు చెప్తున్నావ్ కావాలని సీతక్క మీద అత్యుత్సాహం ప్రదర్శిస్తూ గత మార్చి నెల 17న అసత్య ఆరోపణలు చేయడం జరిగింది. మంత్రి సీతక్క శాఖలో 8 కోట్ల అవినీతి అని మొదట చెప్పి ఇప్పుడేమో 30 కోట్ల అవినీతి అని చెప్తూ అవినీతి ఆరోపణలు చేయడం జరిగింది.అప్పుడే నేను వెంటనే ఖండించి సీతక్క ఎలాంటి అవినీతి చేయలేదని, దొరల దగ్గర పేరు కోసం, రాజకీయంగా ఎదగడం కోసం సీతక్క పై అసత్య ప్రచారాలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు.అయిన కానీ పదే పదే సీతక్క గురించి సామాజిక మాధ్యమాల్లో ప్రస్తావిస్తూ, నిరాధారమైన ఆరోపణలు చేస్తూ సునుకానందం పొందుతున్నావు. ఇప్పటికి అయిన అసలు టెండర్ ఎవరు ఇచ్చారు, ఎలా ఇచ్చారో తెలుసుకొని మాట్లాడు, తెలియకపోతే నేను చెప్తా చూడు.అంగన్వాడీ కేంద్రాలకు మొబైల్ ఫోన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం పోషణ్ అభియాన్ అను పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో టెండరుకు పిలిచింది.అందులో భాగంగా నవంబర్ 2025 న 38,130 మొబైల్ ఫోన్లకు 44 కోట్ల టెండర్ కోరడం జరిగింది. అట్టి టెండర్ కేంద్ర పోర్టల్ అయినటువంటి జెమ్ పోర్టల్ ద్వారా ఐదుగురు ఐఏఎస్ ఆధ్వర్యంలో గ్లోబల్ టెండర్ కోరడం జరిగింది.ఇట్టి టెండర్ 44 కోట్లతో ప్రతి మొబైల్ ఫోన్ కోసం 11,650/- రూపాయలను వెచ్చించి ఫోన్లను కొనుగోలు చేయడం జరిగింది అని అన్నారు.

ఐకెపి సెంటర్ ప్రారంభించిన ఆత్మా డైరెక్టర్ ఎండి యాకూబి

ములుగు ప్రతినిధి ఏప్రిల్ 13 (నినాదం): మంగపేట మండలం మల్లూరు లో రైతుల సౌకర్యార్థం ఐకెపి సెంటర్ ను ఆత్మ డైరెక్టర్ ఎండి యాకూబి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ ఐకెపి సెంటర్ ను స్థానిక రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూజారి సమ్మయ్య ,యర్రంగారి సురేష్ , గ్రామ కమిటీ అధ్యక్షులు మహబూబ్ హుస్సేన్ ,గ్రామ కమిటీ మహిళా అధ్యక్షురాలు సుగ్యాల పుష్పావతి గ్రామ పెద్దలు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వంద మంది

ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ల పంపిణీ



కమలాపూర్ ఏప్రిల్ 13 (నినాదం) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా,కమలాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఆ లైవ్ ఆ రైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మర్రిపల్లిగూడెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహన దారులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ పెద్దలతో కలిసి రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేసారు.గ్రామ ప్రజలందరికీ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో ద్విచక్ర వాహనదారులకు ప్రజా ప్రతినిధుల సహకారంతో వంద మంది ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్లను పంపిణీ చేసి, వారికి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తికి శాంతి చేకూరాలని కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. గ్రామ ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో నో ఎంట్రీ నో హెల్మెట్ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సి ఐ పి నవీన్, ఎస్సైలు మధు, దిలీప్, సిబ్బంది, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి పై పోలీసుల నిర్లక్ష్యం

– బాధిత కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘం నాయకుల ఆరోపణ

భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 13(నినాదం): కాటారం మండల కేంద్రానికి సమీపంలోని జెన్ కో పంప్ హౌస్ వద్ద గత మర్చి 1న అనుమానస్పదంగా మృతి చెందిన పోలం రాజేందర్ కేసు విషయంలో పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘం నాయకులు ఆరోపించారు. కాటారం ప్రధాన కూడలిలో సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి పై బైఠాయించి పోలీసుల తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడారు. గత మర్చి ఒకటో తేదీ రాత్రి సమయంలో మహాదేవపూర్ మండలానికి చెందిన పోలం రాజేందర్ బైక్ పై కాటారం వైపుగా వస్తూ జెన్ కో పంప్ హౌస్ సమీపంలో రహదారిని అనుకోని ఉన్న పంప్ హౌస్ కుండిలో పడిపోయి అనుమానస్పదంగా మృతి చెందినట్లు తెలిపారు. రాజేందర్ మృతి పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు పూర్తి స్థాయి విచారణ చేపట్ట లేదని ఆరోపించారు.. రాజేందర్ మృతి పై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి పట్టించుకోవడం లేదని, కావాలని జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదివాసీ బిడ్డ మృతి పై పోలీసులకు ఎందుకు ఇంత నిర్లక్ష్యం అని ప్రశ్నించారు. రాజేందర్ మృతి ముమ్మాటికి హత్యనే అని, సంఘటన స్థలంలో ఆధారాలు పక్కాగా ఉన్నాయని నాయకులు తెలిపారు.

డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు



కరీంనగర్, ఏప్రిల్ 13(నినాదం): కరీంనగర్ నగరంలో ప్రజలను ఎన్నాళ్లుగానో వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు పాలకవర్గం కృషి చేస్తోందని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. బైపాస్ వద్ద ఉన్న నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఇటీవల డంపింగ్ యార్డులో మంటలు చెలరేగి పొగ, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, మంటలను మూడు రోజుల్లోపు నీటి ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా అదుపు చేయాలని అధికారులను ఆదేశించారు. మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.యార్డులో కొనసాగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను సమీక్షించిన మేయర్, పనుల్లో జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. రోజుకు 150 నుంచి 180 మెట్రిక్ టన్నుల చెత్త చేరుతున్నందున, పేరుకుపోయిన పాత వ్యర్థాలను త్వరితగతిన వేరు చేసి తొలగించాలని కాంట్రాక్ట్ సంస్థకు సూచించారు.ప్లాస్టిక్, మట్టి తదితర వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేసి యార్డును పూర్తిగా శుభ్రపరిచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న చెత్తతో పాటు దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల పాత వ్యర్థాల్లో ఇప్పటికే ఒక లక్ష మెట్రిక్ టన్నుల పైగా శుద్ధి చేసినట్లు వెల్లడించారు.డంపింగ్ యార్డు ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని, స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అదనంగా మరో బయోమైనింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసి రోజుకు 400 టన్నుల చెత్తను శుద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.డంపింగ్ యార్డును పూర్తిగా శుభ్రపరచి ఆ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మేయర్ పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే మానేరు నది పరిసర ప్రాంతాల్లో కాలుష్యం తగ్గి నగరవాసులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాసం గణేష్, చంద్ర, వసంత లక్ష్మీ భూమయ్య, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, ప్రతి ఒక్కరి బాధ్యత

కోదాడ ఏప్రిల్ 13(నినాదం): రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోగలమని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ జిలానీ అన్నారు. సోమవారం కోదాడలోని పెరికా హాస్టల్లో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో' భాగంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన మొదటి గంట 'గోల్డెన్ అవర్'లో బాధితులకు సాయం చేయాలని కోరారు. సాయం చేసే వారికి ప్రభుత్వం 'రాహ్‌వీర్' పథకం కింద నగదు పురస్కారం అందిస్తుందని తెలిపారు. ఏప్రిల్ 18 వరకు సాగే ఈ అవగాహన వారోత్సవాల్లో వాహనదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం లారీ అసోసియేషన్ అధ్యక్షుడు స్థానిక కౌన్సిలర్ తూనం కృష్ణ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా రహదారి భద్రతా ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, కరెంటు ఏఈ నరసింహా నాయక్, నాయకుల రహీం, జనార్ధన్, చంద్రశేఖర్ రెడ్డి, సైదులు, వెంకటయ్య, సత్యనారాయణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు..

రోడ్డు భద్రతపై పలు గ్రామాల్లో అవగాహన



చింతపల్లి, ఏప్రిల్ 13 (నినాదం): పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని వీపిఓల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు తొమ్మిది మందితో కూడిన కమిటీలను ఏర్పాటు చేశారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా మండలంలోని నసర్లపల్లి గ్రామపంచాయతీలో ఆ గ్రామ సర్పంచ్ పంబలి మాలతి వెంకటయ్య అధ్యక్షతన రోడ్డు భద్రత పట్ల అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై ముత్యాల రామ్మూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజు మాట్లాడుతూ వివిధ రకాల వాహనదారులు ఆయా వాహనాలకు సంబంధించి,హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టువడం విస్మరించరాదని సూచించారు.ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపకూడదని,రోడ్డు రవాణా రూల్స్ ప్రకారం నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా మూసుకుపోయిన కంప చెట్లను, చెట్ల పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్ రెడ్డి, జిపిఓ . హమీద్, ఉప సర్పంచ్ వడ్లకొండ నర్సింహా,వార్డు సభ్యులు నక్క సంపూర్ణ శివ,నల్ల అనూష యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి రాజు, మాజీ వైయిస్ ఎంపీపీ పల్లా శ్రీనివాస్ రెడ్డి, విశ్రాంతి ఉపాధ్యాయులు పున్ రెడ్డి విష్ణు వర్ధన్ రెడ్డి, వడ్లకొండ రాములు,విలేజ్ పోలీస్ ప్రసాద్, ఉపాధ్యాయులు రామకృష్ణ, అఖిమ్,అంగన్వాడీ టీచర్లు వడ్లకొండ యాదమ్మ, దార భారతి,ఆశ వర్కర్లు తిరుగుల్ల పుష్పలత, నల్ల చంద్రకళ,మేకల వెంకటయ్య,బొడ్డుపల్లి పరమేష్, వడ్లకొండ వెంకటయ్య,వలబోతు ఆదినారాయణ, షేక్ అబ్బాస్, రషీద్,గౌస్, బీరెల్లి మహేష్,కొడిదాల కిరణ్, బర్ల యాదయ్య,నల్ల కాశయ్య, రాజు శ్రీశైలం, రాములు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

-వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి
-దళారులను నమ్మి మోసపోవద్దు
-పండించిన పంటను కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలి : సర్పంచ్ పల్లే వెంకటేష్ గౌడ్

మునుగోడు, ఏప్రిల్ 13 (నినాదం): మునుగోడు నియోజకవర్గం, నాంపల్లి మండలం. పెద్దాపురం గ్రామంలో, సోమవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి, గ్రామ సర్పంచ్ పల్లె వెంకటేష్ గౌడ్, మండల తాహసిల్దార్ దేవ సింగ్, (హకా) సెంటర్ ఇన్చార్జి డాక్టర్ జి విజయకుమార్ లు హాజరై కొబ్బరికాయలు కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తాసిల్దార్ దేవా సింగ్ మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగిందని, చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఎందుకంటే రైతులు నేరుగా కొనుగోలు కేంద్రానికి వచ్చి పండించిన పంటను అమ్ముకునే ఎసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది కాబట్టి రైతులు ఎక్కడ మోసపోకుండా కొనుగోలు కేంద్రాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏ ఈ ఓ జగన్ మాట్లాడుతూ, ప్రతి ఒక రైతు వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని తాలుపెల్ల లేకుండా ధాన్యాన్ని తీసుకొని వచ్చి ప్రభుత్వం మద్దతు ధరను పొందాలని సూచించారు. సర్పంచ్ మాట్లాడుతూ, పండించిన ధాన్యాన్ని నేరుగా తీసుకొచ్చి కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఉపసర్పంచ్ బక్క రాంబా బు, వార్డు మెంబర్లు పోలే ప్రశాంత్,నాంపల్లి పార్వతమ్మ శంకర్, కమిటీ మెంబర్లు భవాని, వెంకటమ్మ, బుచ్చమ్మ, రైతులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దోనూర్‌లో రోడ్డు భద్రత జాగృతి

మైనర్లకు వాహనాలపై కఠిన నిర్ణయం



ధర్మపురి ఏప్రిల్ 13(నినాదం): గ్రామ స్థాయిలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దోనూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన 'అరైవ్ అలైవ్ ' కార్యక్రమం ప్రజల్లో చైతన్యం రేపింది. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ ఎ. రాంనరసింహారెడ్డి స్పష్టమైన సందేశం ఇచ్చారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా మానుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయని హెచ్చరించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు... గ్రామ తీర్మానం

గ్రామ సర్పంచ్ పురుషోత్తం కీలక ప్రకటన చేశారు. ఇకపై గ్రామంలో మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని తీర్మానం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు సేఫ్టీ కమిటీ ఏర్పాటు

గ్రామంలో రోడ్డు భద్రతపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో సర్పంచ్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, మహిళలు సభ్యులుగా ఉండేలా నిర్ణయించారు.కార్యక్రమం సందర్భంగా గుంతలతో ఉన్న రహదారిని వెంటనే సరిచేసే చర్యలు చేపట్టారు. రెండు ట్రాక్టర్ల మట్టిని పోసి రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి. మహేష్, ఎంపీడీవో రవీందర్, వెటర్నరీ డాక్టర్ వేణుగోపాల్, ఏఎంసీ వైస్ చైర్మన్ సంఘ నర్సింహులు, గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

స్వర్గీయ శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నివాళులు



ధర్మపురి ఏప్రిల్ 13(నినాదం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విశేష సేవలు అందించిన స్వర్గీయ శ్రీపాదరావు సేవలు ఎప్పటికీ మరువలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలోని ధన్వాడ గ్రామంలో సాధారణ కుటుంబంలో జన్మించిన శ్రీపాదరావు, ప్రజల మధ్య నుంచే తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించి, గ్రామ సర్పంచ్‌గా సేవలు అందించారన్నారు. ఆ తర్వాత మంథని సమితి అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీపాదరావు, సభా నిర్వహణలో తన నిష్పక్షపాత వైఖరితో అందరి ప్రశంసలు అందుకున్నారని , ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, సభను సమర్థంగా నడిపించి స్పీకర్ పదవికి మరింత గౌరవం తీసుకొచ్చిన గొప్ప నాయకుడిగా నిలిచారని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.రాజకీయాల్లో విభేదాలు ఉన్నా వ్యక్తిగతంగా అందరితో స్నేహపూర్వకంగా మెలిగే స్వభావం శ్రీపాదరావుదని మంత్రి తెలిపారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరినీ ఆదరించి, ప్రజల మధ్య ఎప్పుడూ చేరువగా ఉండే నాయకుడిగా అజాతశత్రువు అనే పేరును సంపాదించుకున్నారని కొనియాడారు.శ్రీపాదరావు తన రాజకీయ జీవితంలో ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారని, గ్రామీణ అభివృద్ధి, విద్య, సామాజిక న్యాయం వంటి అంశాల్లో ఆయన చేసిన కృషి ఈ తరం నాయకులకు ఆదర్శమని మంత్రి అన్నారు. ఆయన ఆలోచనలు, విలువలు ఇప్పటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.శ్రీపాదరావు వారసత్వాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ప్రజల కోసం కృషి చేస్తూ రాజకీయాల్లో రాణిస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.